మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# గద్వాలలో రూ.130కోట్లతో మెడికల్ కాలేజీ

## వసతి గృహ నిర్మాణానికి భూమి పరిశీలన చేసిన ఎమ్మెల్యే



కాలేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్

**గద్వాల ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని దౌదర పల్లి సమీపంలో 130 కోట్ల వ్యవంతో మెడికల్ కాలేజీ వసతి గృహం ( హాస్టల్) నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరై భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గంలో దౌదర పల్లి సమీప ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతంలో నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజ్ నిర్మాణం చేయడం జరుగుతుందని, ఈ ప్రాంతాన్ని మెడికల్ హాబ్ గా చేస్తామని అన్నారు. గద్వాలలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఈ ప్రాంతంలోని ప్రజలు కర్నూలు, హైదరాబాద్ ప్రాంతాలంకు వెళ్లి చికిత్సలు పొందడం జరుగుతుందని, భవిష్యత్తులో గద్వాలలోనే ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సదుపాయాలు అందేవిదంగా చేస్తామన్నారు. మెడికల్ కాలేజీ వసతి గృహంలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా ఏర్పాటు చేయాలని, త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని కాంట్రాక్టర్ సూచించారు. అదేవిధంగా త్వరలోనే సీఎం, వైద్య, ఆర్థిక శాఖ మంత్రులచే మెడికల్ కాలేజీ భూమి పూజ నర్సింగ్ కాలేజీ ప్రారంభోత్సవం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీతో పాటు పీజీ కళాశాల కూడా ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నం చేస్తానని తెలపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,జిల్లాసీనియర్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, సిబ్బంది అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పి వెంకటేశ్వర్లు

# ర్యాగింగ్‌తో భవిష్యత్‌పై ప్రభావం

## విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం

## మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్,ఏప్రిల్20, ప్రభాతవార్త :**ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి విద్యా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని మహబూబ్‌నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఎస్.వి.ఎస్ వైద్య కళాశాలలో హబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో యాంటీర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డి.ఎస్.పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.ఇటువంటి అనైతిక చర్యలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాన్ని దెబ్బతీస్తాయని, సమాజంలో వారి ప్రతిష్టను తగ్గిస్తాయని తెలిపారు. విద్యార్థులు పరస్పరం గౌరవం, సహకారం, స్నేహభావంతో ఉండాలని సూచిస్తూ, కొత్తగా చేరిన విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాలల్లో ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం నెలకొల్పడం కోసం ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలన్నారు. ర్యాగింగ్‌కు సంబంధించి ఏవైనా ఘటనలు గమనించినప్పుడు వెంటనే కాలేజ్ యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం అందించాలని, బాధితులు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న యాంటీర్యాగింగ్ చట్టాలు విద్యార్థుల రక్షణ కోసం ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ భూపాల్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యాటకులు పెరిగేలా

# ప్రణాళికలు..



పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

- పర్యాటక ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి
- అధునాతన బోట్లను అందుబాటులోకి తీసుకురావాలి
- పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రాయోజిత, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలోను ఇప్పటికే చేపట్టిన, ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) కార్యాలయంలో టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి ఆయన పర్యాటకశాఖపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో వివిధ పర్యాటక ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల ప్రగతి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అంతేగాక వివిధ పర్యాటక ప్రాజెక్టులను ఎప్పటి లోగా పనులు ప్రారంభించి ఎప్పటికి లోగా పూర్తి చేసేది నెలవారీ టైం లైన్ వివరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆద్వర్యంలో ఆయా జిల్లాల్లో రూ. 274.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా వారీగా అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్‌ల తయారీ, నూతన కాటేజీల నిర్మాణం,కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన స్వదేశీదర్శన్,ప్రసాద్,సాస్కీ, సీడీబీడీ ద్వారా చేపట్టిన పనులు నిధుల విడుదల,6ప్రత్యేక పర్యాటక ప్రాంతాల (ఎస్టిఎ ఎస్ ఆధ్యాత్మికం, వారసత్వం, ఎకోవెల్నెస్, హస్తకళలు, జల, బౌద్ధ సర్క్యూట్లు) కోసం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ల రూప కల్పన, నాగార్జున సాగర్, రామప్ప వరంగల్, యాదగిరిగుట్ట,పోచంపల్లి,సోమశిల, ఆలంపూర్ ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, కొత్త బోటింగ్ యూనిట్ల ప్రతిపాదనలు, గిరిజన పర్యాటకం, హరిత హోటల్స్ నిర్వహణ మరమ్మత్తులు, హౌస్ బోట్లు, కల్చరల్ టూరిజం, రవాణా సౌకర్యం, మౌలిక వసతుల కల్పన,తదితర అంశాలపై మంత్రి జూపల్లి అధికారులతో చర్చించారు. రామప్ప ఆలయ సమీపంలోని అనువైన ప్రాంతంలో అదనపు కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన చోట సాంప్రదాయ బోట్‌ల స్థానంలో ఆధునాతన బోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, సోమశిలలో అదనపు బోటును కూడా అందుబాలోకి తీసుకురావాలని సూచించారు. ఎత్తైన ప్రాంతాల్లో, అనువైన వాటర్ బాడీస్ వద్ద రష్యా, చైనా వంటి దేశాల్లో ఉన్న క్యాంటీ లివర్ వ్యూ పాయింట్స్ (గ్లాస్ స్ట్రక్చర్స్) ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. వారసత్వ సంపదను సంరక్షించడంతో పాటు పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. తద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం అవసరమైతే పర్యాటక శాఖ నుంచి నిధులు మంజూరు అయ్యేలా చూస్తామని వెల్లడించారు.రాష్ట్రంలో ఇప్పటికే చేపట్టిన పలు పర్యాటక ప్రాజెక్టులతో పాటు ప్రతిపాదిత ప్రాజెక్టులను సహితం సకాలంలో పనులు చేపట్టి నిర్దిష్ట గడువు ప్రకారం పూర్తి చేసి ప్రజలకు ముఖ్యంగా పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆయా పర్యాటక ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ప్రతి పర్యాటక ప్రాజెక్టును గడువు లోగా పూర్తి చేసేందుకు వీలుగా ఒక టైం లైన్ పెట్టి ఆప్రకారం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... 2047 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీయం ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక –మిగతా4లో..

## రెండో విడత..

# రైతు భరోసా

## మహబూబ్‌నగర్ జిల్లాలో 2లక్షల 15 వేల 167 మంది రైతులు రూ.104.41 కోట్లు జమ

## నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.103 కోట్ల నిధులు జమ



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడత రైతు భరోసానిధులను సోమవారం విడుదల చేసింది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో రైతు భరోసా 2వవిడత నిధులను సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రెండో విడతలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 2 లక్షల 15 వేల 167 మంది రైతులకు గాను 1 ఎకరానికి 6000 చొప్పున 104.41 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో నేరుగా జమచేయటం జరిగింది. ఈ రైతు సభలో ప్రస్తుతం కూడా మళ్ళీ ఎకరా చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 1600 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాల ద్వారా లైవ్ స్ట్రీమింగ్ చేయబడింది. అలాగే జిల్లాలోని 48 రైతు వేదికలో ఈ లైవ్ స్ట్రీమింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయధికారి బి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయధికారి బి. గోపినాథ్,విస్తరణ అధికారులు,నస్రుల్లాబాద్ గ్రామ సర్పంచ్ నిర్మల బాలస్వామి, పోలేమోని సత్య నారాయణ, శ్రీనుయాదవ్,ఎండీఖదీర్,గాలన్న తదితరులు వీక్షించారు. నాగర్ కర్నూలు జిల్లా కు సంబంధించి 2.5 లక్షల మంది రైతులకు గాను రూ.13కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ మేరకు రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులను జమ చేశారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- కిచెన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి, పరిశుభ్రత పాటించాలి...
- బుద్ధారం గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- 69 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ గోపాలపేట మండలం బుద్ధారం గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలవంటగది(కిచెన్) మెస్‌ను పరిశీలించారు.కిచెన్,మెస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఆహారసామాగ్రి నిల్వ రిజిస్టర్లను పరిశీలించి,మెస్‌కమిటీ విద్యార్థులు రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారా లేదా అనే అంశంపై విచారణ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనంచేసి,వారికి అందుతున్న సదుపాయాలు, హాస్టల్‌సమస్యలు తదితర అంశాలపై విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని సూపర్వైజర్ ముందుగా రుచి చూసి, అనంతరం విద్యార్థులకు అందించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరాల ద్వారా మొత్తం 6950 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 570 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించగా, ఈ పాఠశాలలో 400 మంది విద్యార్థుల్లో 69 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అయిన ఓపి ట్రైబ్‌వాలా ఫౌండేషన్, హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా కొత్త కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నితిన్, అభిషేక్, అఖిల్ పాల్గొన్నారు. ఉచితంగా కళ్లద్దాలు అందించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కళ్లద్దాలను సరిగ్గా ఉపయోగించుకొని, విద్యలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలల్లో సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను నిబద్ధతతో సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకాంక్ష మేరకే పనిచేస్తాం

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## జూన్ 2 నుండి రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి భీమా

## విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## 108 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ నగరానికి చెందిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని 108మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజల ఆకాంక్షల మేరకే తాము పనిచేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి – మిగతా4లో..



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## ప్రజావాణి గైర్హాజరైన అధికారులకు

# షోకాజ్ నోటీసులు

## పెండింగ్ ఫైళ్ల తక్షణ పరిష్కారానికి ఆదేశం

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ 126 దరఖాస్తుల స్వీకరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ప్రజావాణిలో అర్జిదారుల నుండి స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సియం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచకూడదని వాటి పరిష్కారానికి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ తో కలిసి ఆర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతూ జడ్చర్ల మున్సిపాలిటీ, భూ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల వద్ద ఉన్న సి.యం. ప్రజావాణి పెండింగ్ ఫైళ్ళ గురించి ప్రస్తావించారు. వాటిని ఎందుకు పిండిలో ఉంచారని సంబంధిత అధికారులను అడిగారు. సమస్యలు ఏమైనప్పటికీ వాటికి పరిష్కరించేందుగు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని, ఆదేశించారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న జనాభా గణనకు సంబంధించిన ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని, అధికారులు సెన్సస్ పోర్టల్‌లో వారికి వారు లాగిన్ చేసుకొని, వారి సొంత వివరాలను నమోదుచేసి జనాభా గణనలో ఎన్యూమరేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని కొందరు అధికారుల వ్యవహారాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి అమలు చేస్తుందని, దీనిని ఆషామాషాగా తీసుకోవద్దని అన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవ్వరికి మినహాయింపు లేదని స్పష్టం చేశారు.ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ – మిగతా4లో..

# ప్రజావాణికి 28 ఫిర్యాదులు

## ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్

**నారాయణపేట,ఏప్రిల్20 ప్రభాతవార్త:**నారాయణపేట జిల్లా ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమర్పించారు. ప్రజల ఫిర్యాదులను సావధానంగా విన్న కలెక్టర్, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 28 ఫిర్యాదులు నమోదయ్యాయి ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

## రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ; దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,ఏప్రిల్20 ప్రభాతవార్త:**రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మండల కేంద్రంలోని గురకొండ, నాగారం, దేవరకద్ర మార్కెట్ యార్డ్‌లో మరియు గోపన్ పల్లి గ్రామాలలో పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాలను దేవరకద్రఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులకు మద్దతు కోసం వ్యవసాయశాఖ మంత్రి ఆదేశాల మేరకు దేవరకద్ర మొక్కజొన్న కొనుగోలు, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం అమ్మిన వారం రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాల అమలు చేస్తుందన్నారు.రైతులు తమ పంటను దళారులకు విక్రయించవద్దని, ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి, ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాలో పడతాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాల్ కు రూ.2389 సాధారణ రకం క్వింటాల్‌కు రూ. 2350 మద్దతు ధర ఇస్తామన్నారు. సన్న రకం ధాన్యం క్వింటాల్ కు రూ.500బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. రైతులెవ్వరు ఇబ్బందులు పడవద్దని ఉద్దేశంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమా చారం ఇవ్వాలని అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజల వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా జిఎంఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసిల్దార్ దీపిక, ఏపిఎం సునీత, గురకొండ సర్పంచ్ దాసరి చిన్నమ్మ, హుసెనప్ప, నాగారం సర్పంచ్ మచ్చేందర్ రెడ్డి, సీఈఓ కిషోర్, టిపిసిసి సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర సీఈఓ శ్రీనివాసులు, ఏవో రాజేంద్ర అగర్వాల్, కౌకుంట్ల ఏవో శివకుమార్, మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, కొండ శ్రీనివాస్ రెడ్డి, నర్వ శ్రీనివాస్ రెడ్డి, ఇనాయత్ అలీ,గద్దె గూడెం పూర్ణిత, జాఫర్, గోపన్ పల్లి సర్పంచ్ బాలరాజ్, శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, సురేందర్ రెడ్డి, గుడిబండ అమరేశ్వర్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

### గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ బషీర్ అహ్మద్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

**లింగాల, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చదువుకు పేదరికం అడ్డు ఆటంకం కాదని చిన్నతనం నుంచే చక్కని క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాల అధిరోహించాలని మండల విద్యా శాఖ అధికారి బషీర్ అహ్మద్ అన్నారు. సోమవారం లింగాలలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలకు సంబంధించిన రికార్డుల తో పాటు వంటశాలను పరిశీలించారు.ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు.9వతరగతి విద్యార్థులకు ముందస్తుగా పదవ తరగతికి సంబంధించిన పాఠ్యాంశాలను బోధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ పదవ తరగతికి సంబంధించిన పాఠ్యాంశాలకు సంబంధించిన కనీస పరిజ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు. రాబోయే వేసవి సెలవులను సద్వినియోగం పరుచుకోవాలన్నారు. విద్యార్థుల చక్కటి జీవితానికి పునాది వేసవి సెలవుల సాధన అని చదువులో రాణించేందుకు విద్యార్థులు ఈ వేసవి సెలవులను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ గారు, ఉపాధ్యాయునీలు, కాంప్లెక్స్ సిఆర్పి హరిలాల్ పాల్గొన్నారు.

## చదువుల పండుగ 2.0 పోటీలు విజయవంతం

### జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక


జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ కృష్ణారెడ్డి

**దామరగిద్ద, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని అన్ని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చదువుల పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థుల కోసం తెలుగు, ఇంగ్లీష్,గణితం,క్విజ్ పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు బుధవారం నారాయణపేటలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని మండల విద్యా అధికారి కృష్ణారెడ్డి సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా చాటుకుని జిల్లా స్థాయిలో విజయం సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక జిహెచ్ఎం సురేష్, జిహెచ్ఎం అన్నపూర్ణ, షేర్ కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ నరేష్, శంకరప్ప, బాలాజీ, జానకిరాములు, శ్రావణి, విజయలక్ష్మి, సంధ్య, సిఆర్పి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పెనిమిళ్ళలో వైద్య శిబిరం విజయవంతం

**ఉప్పునుంతల,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనిమిళ్ళ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. నాగర్ కర్నూల్ జిల్లాలో 86 హై రిస్క్ గ్రామాలు గా గుర్తించారు. జిల్లాలో గుర్తించిన పెనిమిళ్ళ గ్రామంలో మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి డా. స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 సంవత్సరాల పైబడిన వారందరికీ ఎక్స్రే ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ వ్యాధి నిర్ధారణ అవుతే ఆరు నెలల పాటు ఉచితంగా చికిత్స నిర్వహిస్తామని, నిశ్చయ పోషన్ యోజన స్కీం ద్వారా నెలకు రూ. 1000లు అందిస్తారని, టోటల్ హెల్త్ అపోలో ఫౌండేషన్ వారిచే పౌష్టికాహారం, కిట్టు అందిస్తారని ఆమె పేర్కొన్నారు. రోగులు పూర్తికాలపు చికిత్స తీసుకోవాలని ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి, ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డా. స్వప్న, క్షయ వ్యాధి పర్యవేక్షకులు ఎండి ఆరిఫ్ ఖాన్, పుట్ట శరత్ బాబు, సూపర్వైజర్ ప్రభావతి, ఎంఎల్హెచ్‌పి హిమ బిందు, నవ్య, ఐశ్వర్య, రాజు, ఆరోగ్య కార్యకర్తలు, జగదీష్, శ్రీను, మంజుల, భవిష్య, భారత్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తాం

**అమరచింత ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన టిడిపి పార్టీని తెలంగాణ రాష్ట్రంలో బలోపేతానికి కృషి చేస్తామని టిడిపి అమరచింత మండల అధ్యక్షులు మోదీ మనోహరాజ్, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పారుపల్లి మచ్చందర్ అన్నారు. సోమవారం అమరచింత మండల కేంద్రంలోని టిడిపి పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు సందర్భంగా టిడిపి పార్టీ కార్యాలయం దగ్గర కేక్ కట్ చేసి చేశారు. అలాగే అమరచింత ప్రభుత్వ డిఎంఆర్ హాస్పటల్ లో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టిడిపి పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు అనతి కాలంలోనే పార్టీ స్థాపించి బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత టిడిపి పార్టీ దేనని వారు అన్నారు. ఎన్టీ రామారావు స్థాపించిన టిడిపి పార్టీ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో టిడిపి పార్టీకి ప్రజల్లో ఆదరణ పొందుతుందని రాష్ట్రంలో మళ్లీ టీడీపీ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపి, సాయి రెడ్డి, హరీష్, పి రాజు, నజీర్, మలంగ్, రామకృష్ణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## భానుడి భగభగల్లో పోలీసులకు చల్లని ఊరట

### పోలీసు సిబ్బందికి మజ్జిగ అందజేత


పోలీసు సిబ్బందికి మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఏప్రిల్ 20ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో తీవ్రమైన ఎండలతో వేడెక్కుతున్న వేళ, రహదారులపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు మానవత్వం చల్లని ఊరటనిచ్చింది. వీర సావర్కర్ చౌరస్తా వద్ద 15వ వార్డు కౌన్సిలర్ బండి రాజేశ్వరి శివరాంరెడ్డి తన మిత్ర బృందంతో కలిసి పోలీసులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రజా రక్షణ కోసం మండే ఎండలో కష్టపడుతున్న పోలీసుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులకు ప్రజల నుంచి లభించే ఇలాంటి ఆత్మీయ సహకారం వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు–పోలీసుల మధ్య ఇలాంటి కార్యక్రమాలు సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య మాట్లాడుతూ,ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న సిబ్బందికి మజ్జిగ పంపిణీ ఎంతో ఉపశమనం కలిగించిందని చెప్పారు. తమ సేవలను గుర్తించి ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ మాజీ చైర్మన్ జయప్రకాష్ రెడ్డి, జయప్రకాష్, మంద్రే రవి తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులు తప్పిదాలు లేకుండా నిర్వహించాలి


సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు,
పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం

**వెల్దండ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలలో రికార్డులు ఎలాంటి తప్పిదాలు లేకుండా సరిగ్గా నిర్వహించాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో కృష్ణయ్య అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సర్పంచులు ఉపసర్పంచ్ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత మీ అందరిపై ఉందని మండలంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించిన కొనుటకు నిర్ణయించిన మేరకు గృహప్రవేశాలు చేసుకొనుటకు లబ్ధిదారులను చైతన్య పరచాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూర ఈ కూడా ఇంకా మార్కౌట్ చేసుకొని లబ్ధిదారులను వెంటనే పనులు ప్రారంభించే విధంగా చూడాలని ఉపాధి హామీ పనులలో వంద మంది కూలీలకు పనికి వచ్చే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య


తాడురు పాఠశాలలో కరపత్రం విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో విశ్వజనీన ఆలోచనకు పునాదులను, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మండలవిద్యాధికారి నామని చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు.సోమవారం మండలంలోని తాడూరు గ్రామంలో ఆ పాఠశాల హెచ్ఎం రామస్వామి అధ్యక్షతన జరిగిన బడిబాట కార్యక్రమంలో భాగంగా కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల ప్రగతిని ప్రజలందరికీ తెలియజేయాలని వివరించారు. అందులో భాగంగా తాడూరు గ్రామంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రజలకు పాఠశాల ఉపాధ్యాయులు కరపత్రాల తో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను,ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో భాగస్వామ్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, విశాల దృక్పథం, సామాజిక బాధ్యత వంటి విశ్వజనీన ఆలోచనకు ప్రభుత్వ పాఠశాలలు పునాదిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం ఇరవై ఒక్క వస్తువులతో కూడిన కిట్టు ను ప్రతి విద్యార్థికి అంద జేస్తారని పాఠశాల హెచ్ఎం రామస్వామి వివరించారు. కిట్టులో పెన్నులు, పెన్సిల్, బూట్లు, బెల్టు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు తదితర వస్తువులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉదయం అల్పాహారం ప్రభుత్వం కల్పించబోతుందని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేస్తారని ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని, ఉపాధ్యాయులను బాధ్యులను చేయండి అని తెలియజేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, కాంప్లెక్స్ జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి,ఆ పాఠశాల హెచ్ఎం రామస్వామి, గ్రామ సర్పంచ్ ఏలేటి అలివేల మల్లయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, శ్యామల, కమల, వసంత్ కుమార్, శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి చందు నాయక్, గ్రామస్తులు తిమ్మారెడ్డి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

**మదనాపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మదనాపురం సర్పంచ్ శారదరామకృష్ణ,మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలం కేంద్రంలో మార్కెట్ యార్డ్, అజ్జకొల్లు,గోపన్ పేట గ్రామాల్లో ఐకేపీ,సింగల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతుధర పొందాలని సూచించారు. ధాన్యాన్నిదళారుకు విక్రయించి మోసపోవద్దని రైతులకు తెలిపారు. కొనుగోలు కేంద్రాలవద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. రైతులు కొందరి వివిధ పార్టీల రాజకీయ నాయకుల మాటలు విని తొందరపడవద్దని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుందని రైతులకు ధైర్యం చెప్పడం జరిగిందని అన్నారు. అజ్జకొల్లు గ్రామానికి 17 వేల గన్ని బ్యాగులు శనివారం వచ్చాయని తెలిపారు. రెండు రోజులలో 20 వేల గన్ని బ్యాగులు పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు నాగరాజుగౌడ్,రామచంద్రయ్య ,మల్లేష్ ,అంజలమ్మ,కాంగ్రెస్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్ రెడ్డి,మండల సమన్వయ కో ఆర్డినేటర్ చుక్కమహేష్, మండల నాయకులు జగదీష్ ,వెంకట్ నారాయణ,టీసి నాగన్న, సత్యశిలారెడ్డి, అంజద్ అలీ, వేమన్న, హనుమాన్ రావ్, సాయిబాబా, రాజిరెడ్డి, రామకృష్ణ రెడ్డి ,మహేందర్, మన్యంకొండ, రంగన్న, అశోక్, శరణ్, సుదర్శన్‌గౌడ్, దేవేందర్, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో బెల్ట్ షాపులు ఉండరాదు : సర్పంచ్ మేడసాని శ్రీలత

### అందరి సహకారంతో పెనిమిళ్ళ గ్రామం మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి


పెనిమిళ్ళ లో బెల్టు షాపుల యాజమానులతో
మాట్లాడుతున్న సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి

**ఉప్పునుంతల,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** అందరి సహకారంతో గ్రామంలో మద్యం విక్రయాలు జరుపరాదని, జిల్లాలోని మద్యపాన రహిత గ్రామంగా ఆదర్శంగా నిలిచేలా సహకరించాలని గ్రామ సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి కోరారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన బెల్ట్ షాప్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో మద్యపానం విచ్చలవిడిగా అమ్మకాలు జరపడంతో చాలామంది కుటుంబాలు వీధిన పడుతున్నారని, గ్రామంలో మద్యపానం విక్రయాలు స్వచ్ఛందంగా నిలిపివేయాలని ఆమె కోరారు. మన గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకు గిఫ్ట్‌గా అందజేద్దామని ఆమె కోరారు. గ్రామాభివృద్ధి కోసం పాటు పడుతామని, కానీ గ్రామంలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగు తుండడంతో గ్రామం, గ్రామంలోని ప్రజలు వెనుకబడి పోతామని ఆమె వివరించారు. శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలోని వెల్టూరు స్టేజికి అతి సమీపంలో ఉన్న వైన్ షాపు నుంచి బెల్ట్ షాపులకు మద్యం విచ్చలవిడిగా సరఫరా చేయడంతో గ్రామాలు కుంటు పడుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలని కాదని మన గ్రామాన్ని జిల్లాలోనే మద్యపాన రహిత గ్రామంగా చేయాలని లక్ష్యంతో ముం దు కెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామంలో మద్యం విక్రయాలు, నాటు సారా, నల్ల బెల్లం వ్యాపారం నిలిపివేయాలని బెల్ట్ షాపు యజమానులకు సూచించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ జైపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ,జిపిఓ శంకర్,నాయకులు మెడ సాని విజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు సజ్జు, నారమ్మ హుస్సేన్, సుధాకర్, మారం రవి, పుష్ప నాగరాజు, యాదమ్మ, ఆంజనేయు లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో బిసి కాలనీలో మెరుగుపడిన ఇంటర్నల్ రోడ్లు


జాలు పారకుండా చేసి
రాకపోకలకు మెరుగు పరిచిన ఇంటర్నల్ రోడ్డు

**ఉప్పునుంతల,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ కృషితో మండల కేంద్రమైన ఉప్పునుంతల బిసి కాలనీ 10వ వార్డులో ఇంటర్నల్ రోడ్డు మెరుగుపడింది. వర్షా కాలం వస్తే పదో వార్డులో నడవడానికి వీలు లేకున్నా ఉన్నా ఇంట ర్నల్ రోడ్‌లో సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు సహకారంతో పం చాయతీ రాజ్ ఎఇ మహేష్ పర్యవేక్షణలో రోడ్డు సౌకర్యం మెరుగు పరిచారు. దీంతో 10వ వార్డు సభ్యులు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకు, ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కొన్నేళ్ళుగా తమ కాలనీ వరదతో నడవలేకపోయామని, వర్షాలు తగ్గిన విపరీత మైన పిచ్చి గడ్డి పెరిగి అయ్యో రామా అన్న చందంగా జీవించామని కాలనీవాసులు వాపోయారు. ఎన్నికల సమయంలో తమ కాలనీ లో పర్యటించిన ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్ల డం జరిగిందని, ఎమ్మెల్యే సహకారంతో సర్పంచ్ చింత గాళ్ళ శ్రీని వాసులు తమ కాలనీలో రోడ్డు మార్గం మెరుగు పరిచారని వారికి ఎల్లప్పుడూ తమ సహకారం అందిస్తామని కాలనీ వాసులు వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమ కాలనీ తీర్చిదిద్ద డానికి ఎమ్మెల్యే ఇచ్చిన ఆర్థిక సహకారంతో సర్పంచ్ చేసిన సహకారం అభినందనీయమని కాలనీవాసులు అంటున్నారు.

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట

## సొసైటీ వారు ఉప్పునుంతల పరిధిలో నిర్వహించడం ఏంటి

### అధికార పార్టీ అసమర్ధత : డిసిసిబి మాజీ డైరెక్టర్ సత్తు భూపాల్ రావు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఉప్పునుంతల లో అచ్చంపేట సొసైటీ వారు ఉప్పునుంతల మండల పరిధిలో నిర్వహించడం ఏంటి అని, అధికార పార్టీ అసమర్ధత తోనే ఇలా జరుగుతుందని మాజీ డిసిసిబి డైరెక్టర్, సొసైటీ మెంబర్ సత్తు భూపాల్ రావు తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సొసైటీగా పేరున్న ఉప్పునుంతల మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వారి సౌజన్యంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించాల్సి ఉండగా ఏకంగా అచ్చంపేట సొసైటీ వారు ఉప్పునుంతల మండల పరిధిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం పలు అనుమానాలు తావిస్తున్నాయని, అధికార పార్టీ అసమర్ధత తోనే ఇలా జరుగుతుందని ఆయన తీవ్రంగా ఖండించారు. గతంలో ఎన్నో సంవత్సరాల నుంచి సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు, వేరుశనగ, వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేసిన సొసైటీకి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట మండలం సొసైటీ వారికి అప్పగించి ఉప్పునుంతల సొసైటీ ని విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో అత్యధికంగా మండలం లో మొక్కజొన్న పంట సాగు చేసుకున్న రైతులకు సౌకర్యం గా స్థానిక ఉన్న సొసైటి కాదని ఇతర ప్రాంతాల వారికి కొనుగోలు కేంద్రం అప్పజెప్పడం అధికార పార్టీ పాలకుల వైఫల్యం అని ఆయన అన్నారు. సత్వరమే ఉప్పునుంతల సొసైటీ వారి ఆధ్వర్యంలో మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో అత్యధికంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులకు సొసైటీకి ఉన్న అనుబంధం విడదీసిన వారు అవుతారని, భవిష్యత్తులో ఉప్పునుంతల మండలంలో ఉన్న రైతులకు అచ్చంపేట సొసైటీ వారు రుణాలు అందిస్తారా అని ఘాటుగా ప్రశ్నించారు. సత్వరమే మండల నాయకులు, సర్పంచులు ఉప్పునుంతల మండల సొసైటీ వారి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు.

## తలసీల బసవపూర్ణయ్యకు నివాళులర్పించిన డిగ్రీ కాలేజీ సిబ్బంది


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**వడ్డేపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ఆదివారం ఉదయం శ్రీ తల శిల బసవపూర్ణయ్య శాంతినగర్ లో నిన్న స్వర్గస్తులైనారు ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాంతినగర్ విశాల హృదయంతో పేద ప్రజల బిడ్డల ఉన్నత విద్య కోసం కోట్లు విలువ చేసే స్థలాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపనకు విరాళంగా ఇచ్చి ఆయన మహోన్నత హృదయాన్ని చాటుకున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రామ ఓబులేష్ బసవ పూర్ణయ్య ఉదాత్త హృదయాన్ని కొనియాడారు. ఉపాధ్యాయ నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులందరూ పుష్ప గుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యా పట్ల బసవపూర్ణయ్య పట్టుదల కృషి ఆయన సేవలను స్మరిస్తూ కళాశాలలో మౌనం పాటించారు. ఆయన ఆశలను సాధించాలని విద్యార్థులకు ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు.

## కేసీఆర్ జనగర్జనకు బీఆర్ఎస్ నేతలు


జనగర్జన సభలో పాల్గొన్న భూత్పూర్ బీఆర్ఎస్ నేతలు

**భూత్పూర్,ఏప్రిల్ 20,ప్రభాతవార్త :** బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్)జగిత్యాలలో సోమవారం నిర్వహించిన కేసీఆర్ జనగర్జన సభకు దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు.మండల బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డి,మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహ్మగౌడ్,మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణలతో పాటు పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టీ మురళిధర్(టీఎం)గౌడ్,రాము రాథోడ్,సత్తూర్ అశోక్‌గౌడ్,కుర్మయ్య,శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు.

## దేవాలయానికి విరాళం అందజేత


దేవాలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయపునర్నిర్మాణనికి సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ ఆలయనిర్మాణనికి రూ.50వేలు ఆలయ కమిటీనిర్వాహకులకు అందజేశారు.ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండు, వార్డ్ మెంబర్ శేఖర్, ఆనంద్, నీరాజన్ బలరాం, జగిలి ఆనంద్ , గోరటి భరత్, డేవిడ్, రాజు, చంద్రమౌళి, శ్రీనివాస్, వెంకటేష్ , సంజీవ, సుధాకర్ ,కిరణ్, అంజి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మహాత్మా బసవ జయంతి


బసవ జయంతిలో పాల్గొన్న అల్వాల రాజశేఖర్ రెడ్డి

**మల్దకల్ ఏప్రిల్ 20, ప్రభాతవార్ :** మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన బసవ జయంతి వేడుకల్లో అల్వాల రాజశేఖర్‌రెడ్డి పాల్గొని, బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈయన సేవలు మరుపు రానివి అని చెప్పడం జరిగింది.అలాగే శివుడు ఒక్కడే,అన్ని కులమతాలు ఒక్కటే అన్న నినాదం చెప్పింది బసవేశ్వరుడే. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్,వీర శైవ లింగాయితులు పరమేశ్వరయ్యా, పంపయ్య, రాజశేఖర్, రమేష్, నాగశివుడు, జగదీశ్,చంద్రన్న,నగేష్,విశ్వనాథ్,మునింద్ర,వీరేష్, వెంకటేశ్వర్లు,గ్రామస్తులు శివన్న, నర్సింహా, అంజి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి విరాళం


అంబేద్కర్ విగ్రహ నిర్మాణం కోసం విరాళం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బాబా సహాయం అంబేద్కర్ విగ్రహానికి చల్లపల్లి గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్య రూ.20 వేలను నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. వెంకటేష్,రామస్వామి,జగదీశ్వర్,లక్ష్మయ్యయాదవ్ , రామాంజనేయులు,శశి కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఏపి సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**దామరగిద్ద, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కందేన్‌పల్లి గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, కార్యకర్తలు, గ్రామ ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే కార్యకర్తలు మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా టిడిపి పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన నాయకులు రాములు యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును విజనరీ నాయకుడిగా అభివర్ణించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, సైబరాబాద్ నిర్మాణంలో ఆయన పాత్ర విశేషమని తెలిపారు. ఆయన కృషి వల్ల తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నుంచి అధిక ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటు నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు రాములు యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు, లింగారెడ్డిపల్లి సర్పంచ్ మొగులప్ప, ప్రధాన కార్యదర్శి అశోక్, ఈరన్నగౌడ్, బుగ్గప్ప, కనకప్ప,నారాయణ, శివకుమార్‌యాదవ్, ఆంజనేయులు, అంజిలప్ప,శివ,భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ వద్ద టీసీటీ టీస్టాల్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,ఏప్రిల్20,ప్రభాతవార్త:** భూత్పూర్‌కు సమీపంలోని పాల్కొండ బైపాస్ వద్ద భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన శివకుమార్ ఏర్పాటు చేసిన టీసీటీ టీస్టాల్‌ను సోమవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్నాసాగర్ సర్పంచ్ ఆలశ్రీకాంత్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొడుగు అంజనేయులు,కోజాలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై అవగాహన

**పెద్దమందడి, ఏప్రిల్20 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 23 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు పంచాయతీ కార్యదర్శుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 ఫైనల్స్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగ విధానం గ్రామపంచాయతీ ఖర్చుల నిర్వహణ పద్ధతులు మరియు డిజిటల్ టోకెన్ వినియోగంపై వివరించారు.మండల పంచాయతీ అధికారి ఇన్చార్జి ఎంపీడీవో పుష్ప మాట్లాడుతూ నిధుల వినియోగంలో పారదర్శకత బాధ్యతయుతమైన ఖర్చు విధానం పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.గ్రామాల అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో అన్ని23 గ్రామపంచాయతీలకు చెందినప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నారాయణపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలోని ఊట్కూర్ మండలం ఆవులోనిపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఐకెపి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో కొండన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విశ్వేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఈవో గణేష్ రెడ్డి, ఏపీఎం వనితలు హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందనితెలిపారు. రైతులు మధ్య వర్తులపై ఆధారపడకుండా నేరుగా కేంద్రాలకు తమ వడ్లను విక్రయించాలని సూచించారు. రైతులకు గ్రేడ్‌ఏ రకానికి రూ.2,389, సాధారణ రకానికి రూ. 2,369 చెల్లించబడుతుందని, అదనంగా సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లమ్మ తిమ్మప్ప, ఆర్ఐ వెంకటేష్, ఏఈఓ స్వప్న, స్థానిక నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**నారాయణపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** నారాయణ పేట కేంద్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్ సూచించారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా పేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాలలోని స్నానాల గదులు, మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం ఈఏపీసెట్ క్రాష్ కోర్స్ విద్యార్థులతో మాట్లాడి వారి చదువుల పరిస్థితులను తెలుసుకున్నారు. వంటగది ప్రాంగణాన్ని కూడా పరిశీలించి, ఆహార తయారీ ప్రాంతం సహా మొత్తం ప్రాంగణం శుభ్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## 12 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత



పిడిఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు

**మద్దూర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్, మద్దూర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనలో సుమారు 12 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, బి.వెంకటేష్ (తండ్రి నరసప్ప), ఎస్సీ కాలనీ, మద్దూర్ నివాసి, చుట్టుపక్కల గ్రామాల నుండి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం సేకరించి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం అందింది.ఈ మేరకు పల్లెర్ల గ్రామ శివారులో తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు నిర్వహించగా,అశోక్ లేలాండ్ వాహనంలో 40బస్తాలు (సుమారు 12 క్వింటాళ్లు) బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు.పోలీసులు బియ్యం మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారణ జరిపి, డిటి భాస్కర్ పంచనామా పూర్తి చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పిడిఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా,రవాణా చేసినా లేదా విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని నిరాహార దీక్ష

**పెబ్బేరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో పెబ్బేరు నుండి వనపర్తి వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు ప్లాట్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని బాధితుల సంఘం నాయకులు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సుభాష్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు కోల్పోయిన బాధ్యతలకు డబుల్ బెడ్‌రూమ్ లేదా ప్లాట్లు కేటాయించి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని వారన్నారు. ఈ విధంగా వనపర్తి వెళ్లే రహదారిలో ఇరువైపులా 40ఫీట్ల మేర రహదారి నిర్మాణం చేపట్టి డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని వారి డిమాండ్ చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇరువైపులా 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఎంఐఎం, బీఎస్పీ, సిపిఐ, పొలిటికల్ జేఏసీ నాయకులు మద్దతు తెలుపుతున్నట్లు సంఘాల నాయకులకు తెలిపారు. బాధితులైన శ్రీధర్ రెడ్డి, వెంకట్ రామ్, జి.వెంకటేష్, హనుమంత్ రెడ్డి, శ్యాముల్, చాకలి రాముడు, సీతమ్మ, నరేందర్ జి, మోహన్‌లాల్, నరసింహ గౌడ్, శ్రీనాథ్, రఫీ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

## మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సదుపాయం

**మక్తల్ టౌన్, ఏప్రిల్20 ప్రభాతవార్త:** మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులు, సహాయకుల కోసం తాగునీటి సౌకర్యానికి గాను వాటర్ మిషన్ ను స్థానిక వార్డకౌన్సిలర్ల అల్కూరి పావని ప్రారంభించారు. సోమవారం రోజు ఆస్పత్రిలో దాత అక్కల రాకేష్ సహకారంతో దాదాపు రూ. 30 వేల విలువైన మంచినీటి సదుపాయం అందించే మిషన్ ను ఆసుపత్రి ఇన్చార్జ్ డా. వినీతతో కలిసి అల్కూరిపావని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సమయంలో తీవ్ర ఉక్కపోతల నడుమ ఆసుపత్రికి వచ్చే ప్రజల కోసం మంచినీటిని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా దాత అక్కల రాకేష్ ముందుకు వచ్చి వాటర్ మిషన్ అందించడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ సందర్భంగా అక్కల రాకేష్ ను ఆసుపత్రి సిబ్బందితో కలిసి శాలువా కప్పి సత్కరించారు. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో అతి త్వరలో 150 పడకల ఆసుపత్రి అందుబాటులోకి రాబోతుందని, మరిన్ని అత్యాధునిక సదుపాయాలు ఆ ఆసుపత్రిలో మక్తల్ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వస్తాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన వారోత్సవాలను విజయవంతం చేయాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 26వ తేదీ వరకు అన్ని సంక్షేమ వసతిగృహాలు పాఠశాలల్లో నిర్దేశించిన ప్రత్యేక కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాలపై జిల్లా కలెక్టర్ సంబంధితఅధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులందరూ తమ కేటాయించిన ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు సందర్శించి ఆయా పాఠశాలల్లో కిచెన్ పరిశుభ్రత, ఇతర సానిటేషన్ కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో మెస్ కమిటీలు యాక్టివ్‌గా ఉన్నాయా లేదా తనిఖీ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్ లలో మెస్ కమిటీ విద్యార్థులు సంతకాలు చేస్తున్నారా లేదా తనిఖీ చేయాలని సూచించారు. అదేవిధంగా కిచెన్, మెస్ పరిశుభ్రత తో పాటు వంట సామాగ్రి ఎక్స్పైరీ డేట్ ను కూడా తనిఖీ చేయాలని సూచించారు. సూపర్వైజర్ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అనే అంశాన్ని కూడా తనిఖీ చేయాలన్నారు. ఇక సంక్షేమ వసతి గృహాలు పాఠశాలలకు సంబంధించి ఏమైనామరమ్మతులు అవసరం ఉంటేరాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పంపించిన గూగుల్ ఫామ్ లో నమోదు చేయాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు విద్యార్థులకు టాలెంట్ ఫెస్టివల్ పేరుతో క్విజ్, డిబేట్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.మూడో రోజున అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు.నాలుగో రోజున విద్యార్థుల తల్లి దండ్రులను పాఠశాలకు ఆహ్వానించి ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సౌకర్యాలపై వివరించాలని తెలిపారు. తదుపరి రోజుల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, సమ్మర్ క్యాంప్స్, బడిబాట కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

**పోస్టర్ల ఆవిష్కరణ :** ఎండాకాలంలో వేడి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టరును కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ స్కీంకు సంబంధించిన పోస్టరును కూడా ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, హౌసింగ్ పీడీ విఠోబా, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గద్వాల ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** సంక్షేమ వసతి గృహాలను సంబంధిత సిబ్బంది శుభ్రంగా ఉంచుకుంటేనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటారని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ సోమవారం గద్వాలలోని బీసీ బాలికలసంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని వంటశాలను, స్నానపు గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు రుచికరమైన వంటలను వండించి పెట్టాలన్నారు.వసతి గృహ వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రస్తుతం అక్కడ కల్పించిన సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం



వంట గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

చేస్తూ అధికారులను అభినందించారు. వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఇలాగే ఎల్లప్పుడూ సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు వార్డెన్ కు, అక్కడి సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారినుషిత,వసతి గృహవార్డెన్ ప్రమీల,సిబ్బంది పాల్గొన్నారు.

## బసవేశ్వరుని బోధనలు అనుసరణీయం



బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**గద్వాల ఏప్రిల్ 20, ప్రభాతవార్త;** కుల, మత, లింగ భేదాలను తీవ్రంగా వ్యతిరేకించి సమాజంలో స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని నినదించిన బసవేశ్వరుని బోధనలు అనుసరణీయమని అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు అన్నారు.విశ్వగురు బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకొని సోమవారం గద్వాల ఐడిఓసి వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి అధికారులు, వీరశైవ సంఘం నేతలు పూలమాలలు వేసి పూజలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ పాల్కురికి సోమనాథుడు బసవ పురాణం ద్వారా కర్ణాటకకు చెందిన బసవన్న జీవితాన్ని తెలుగులో ప్రసిద్ధి చేశారన్నారు. బసవన్న తన వచన సాహిత్యంతో ప్రజలందరిని కులమతాలకతీతంగా ఏకం చేశారన్నారు. ఆయన బోధనలలోని సమదృష్టి ఎందరినో ఆకర్షించిందని, సూక్ష్మమైన తత్వం సులువుగా బోధపడేదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, వీరశైవ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**గద్వాల ఏప్రిల్ 20,ప్రభాతవార్త;** ప్రజా వాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పరిష్క రించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు తో కలిసి ఆయన ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, మాట్లాడుతూ ఈ వారంవివిధ సమస్యలపై మొత్తం83 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో మన జిల్లాకు సంబంధించి మొత్తం 111 ఆర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ కార్య క్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

◆ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

**ఆత్మకూర్ ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ రైతుల శ్రేయస్సు ప్రభుత్వ చేయమని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా అన్నారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత రబీసీదానికి సంబంధించి పరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించాలని దళారులను నమ్మి మోసపోకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంతో పాటుగా మండలంలోని మూలమల్ల, జూరాల, మేడేపల్లి, గుంటుపల్లి తదితర గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దకే అధికారులు చేరుకొని ధాన్యాన్ని కొనుగోలు చేయునట్లుగా ఆయన తెలిపారు. ఇప్పటికేమండలంలో దళారీలు రైతులను నిలువునాముంచేందుకు పంటల వద్దకు చేరుకుని ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు రైతులు ఎట్టి పరిస్థితిలో అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు దరని పొందాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల శ్రేయస్సును కోరుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రెండో విడత కూడా రైతు భరోసాని విడుదల చేసి రైతుల ముఖంలో సంతోషాలు వెలివేరిసేలా చర్యలు చేపట్టడాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుపరమేష్ వనపర్తి జిల్లా కార్యదర్శి తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి పంపు శ్రీనివాసులు, మనివర్ధ, మహేష్,తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన నాయకులు

**నారాయణపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎన్‌పీఆర్‌డీ ఇండియా పేట జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. జిల్లా అధ్యక్షుడు గజలప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణపతి ఆధ్వర్యంలో ఈవినతిని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ పథకాల అమలులో తీవ్ర ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు కావాల్సిన యూనిట్లు సమయానికి అందడం లేదని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ యూనిట్లను తక్షణమే విడుదల చేయాలని కోరారు.అదేవిధంగా దివ్యాంగులకు అవసరమైన మోటరైజ్డ్ వాహనాల మంజూరులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన అర్హులకు వీలైనంత త్వరగా వాహనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు టీ.మధుబాబు, పేట జిల్లా అధ్యక్షుడు గజలప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గణపతి, హనుమంతు, మునేష్, వెంకటేష్, రాము, విజయ్, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక..



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు

**రాజాపూర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజాపూర్ మండలం కుతినేపల్లి గ్రామ పంచాయతీకి చెందిన రఘుపల్లి సుధాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, వార్డ్ మెంబర్ దేవావత్ రమేష్, డి.రవి, రాఘుపల్లి శ్రీను ఎమ్మెల్యే సమక్షంలో గ్రామఅభివృద్ధి కోరకు కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. గ్రామ అభివృద్ధికి ఎల్లవేళల సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొండ్లపల్లి ఉప సర్పంచ్ శివకుమార్, సీనియర్ నాయకులు (యాదగిరి) గిరిగౌడ్, ఆవులమంద వెంకటేశ్, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాజు నాయక్, రాఘవపూర్ గ్రామ అధ్యక్షుడు మల్కాపురం మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి

**మద్దూర్, ఏప్రిల్20 ప్రభాతవార్త:** మద్దూర్ మండలంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డిటిడిఓ) ఛత్రునాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పోర్లకుంట తండా గ్రామ సర్పంచ్ ఆర్.దశరథ్‌నాయక్, నారాయణ నాయక్ మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సేవలుఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని వివరించారు. ముఖ్యంగా తండాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. వారి వినతిని స్వీకరించిన అధికారి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఆశన్‌పల్లిలో 65 మంది కార్యకర్తలు తెలంగాణ జాగృతి పార్టీలో చేరిక

**దామరగిద్ద, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని ఆశన్‌పల్లి గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటు చేసుకుంది.రిటైర్డ్ ఎంపీడీఓ నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 65 మంది కార్యకర్తలు తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాగృతి పార్టీ అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, కొత్తగా చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, కవిత అక్క ఆధ్వర్యంలో ఈ నెల 25న జరగనున్న నూతన పార్టీ ఆవిర్భావ సభకు జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.భవిష్యత్తులో జాగృతి పార్టీ అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ,సర్వోదయ తెలంగాణ సాధనకు కృషి చేస్తుందని తెలిపారు. ఆశన్‌పల్లి గ్రామం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పార్టీలో చేరడం ఆనందదాయకమని, గ్రామ అభివృద్ధి,ప్రజల సమస్యల పరిష్కారం కోసంజాగృతి పార్టీ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లీన్ గ్రీన్ కార్యక్రమం

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషద్ ప్రైమరీ పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ పరిశుభ్రత గురించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామని,విద్యార్థులు తమఇంటిని, పాఠశాలను పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుంటూ అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ రాధాకృష్ణతో పాటు, మెంబెర్ షిప్ కో ఆర్డినేటర్ హకీమ్ విశ్వ ప్రసాద్,క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్ కుమార్, మాజీ అధ్యక్షులు పోలశ్రీనివాసులు, ప్రేమ్‌కుమార్ రెడ్డి, పాఠశాలఉపాధ్యాయబృందం,మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలు చదువుల్లో రాణించాలి

**కొల్లాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు చౌట బెట్ల గ్రామానికి చెందిన అమరచింత వైష్ణవి తండ్రి అమరచింత రామకృష్ణ ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 485/500 మార్కులతో టాపర్గా వచ్చిన సందర్భంగా నేడు గ్రామంలో గ్రామ ప్రజల సమక్షంలో సోమవారం అమరచింత వైష్ణవిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో చదువుల్లో ఉన్నత స్థాయిలో రాణించాలని, ప్రతి విషయంలో నైపుణ్యం పెంపొందించుకొని ఆత్మ స్థైర్యంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో చౌటబెట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరికంటి కమలాకర్ రావు,వంగ రాజశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

**నర్వ, ఏప్రిల్20 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఒక వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు, రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పేర్కొన్నారు.సోమవారం నారాయణ పేట జిల్లా నర్వ మండలంలోని లంకాల గ్రామంలో శుక్రవారం కొట్టం సుమిత్ర దేవి,రవిరెడ్డిల ఇందిమ్మ ఇంటి గృహ ప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్‌తో కలిసి ఇంటిని ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి,ఎంపీడీఓ శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడుశరణ్,యూత్ అధ్యక్షుడు అశోక్,కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

**వెల్దండ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య ఉపాధి హామీ పనులలో జిల్లాలోనే బొల్లంపల్లి గ్రామ పంచాయతీలో ఎక్కువ మంది కూలీలను పని దినాలు కల్పించి 100 శాతం అటెండెన్స్ పూర్తి చేసినందుకు డిఆర్‌డిఓ సూచన మేరకు వేయి రూపాయల ప్రోత్సాహక బహుమతిని ఎంపీడీవో కృష్ణయ్య చేతుల మీదుగా ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య కు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వర్ జి సూపరింటెండెంట్ మోహన్ లాల్,ఎంపీఓ లక్ష్మణ్, దేవేందర్, ఈసీ సత్యనారాయణతో పాటు తదితరులు ఉన్నారు.

## ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని కూలీల ధర్నా

**పెబ్బేరు, ఏప్రిల్20 ప్రభాతవార్త:** ఎర్రటి ఎండలో కష్టపడి పని చేసిన తమకి మూడు నెలలుగా కూలీ డబ్బులు అందడం లేదని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మండల పరిధిలోని వ్యాపారల గ్రామంలో ఉపాధి కూలీలకు ఫిబ్రవరి 9వ తేదీ నుండి కూలీ డబ్బులు నేటి వరకు కూడా చెల్లించడం లేదని వారు సోమవారం ధర్నా చేపట్టారు. ఉపాధి హామీ కూలీలు గ్రామసర్పంచ్ స్వరాజ్యం బాబురెడ్డి, గ్రామ పంచాయతీ కార్య దర్శి జ్యోతి, జిపిఓ పరమేశ్వర్‌లకు తమ సమస్యలను విన్నవిస్తూ వినతి పత్రం అందజేశారు. తామందరం కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని గత మూడు నెలలుగా ఉపాధి కూలీ డబ్బులు అందకతీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నామని ఉపాధి కూలీలుగోడు వెల్లబోసుకున్నారు.తాము పనిచేసే చోట ఎలాంటి టెంటులు, కానీ ఫిల్టర్ వాటర్ కానీఅందించడం లేదని వారు వాపోయారు. ఉపాధి కూలీల సంఘం నాయకులు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘంఅధ్యక్ష, కార్యదర్శులు,ఉపాధి కూలీలు, బుడ్డమ్మ, భాష, రాణి,చంద్రమ్మ,సాయిలీల,జయమ్మ,నాగన్న, బీచుపల్లి నాగేంద్రం, ఎల్లమ్మ తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## మెడికల్ కాలేజీలో క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**గద్వాల ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో మహిళా సమైక్యవారిచే ఏర్పాటుచేసిన నూతన క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే క్యాంటీన్ పరిసరాలను, సౌకర్యలను పరిశీలించారు. క్యాంటిన్ లో విద్యార్థులకు కావలిసిన వస్తువులను అందుబాటులో ఉంచాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, వైస్ చైర్మన్ శంకర్, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి,రమేష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు, మహిళా సమైక్యసభ్యురాలు,మెడికల్ కాలేజీప్రిన్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.



మక్తల్ 6వ వార్డు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సత్యమ్మ గెలుపు

## మక్తల్ 6వ వార్డు బీజేపీ కైవసం

**మక్తల్ టౌన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ లోని 6వ వార్డు మొన్నటి ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎరుకలి సత్యమ్మ అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి ఎరుకలి మారెప్ప పై 37ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించారు. ఇటీవల ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపల్ ఎన్నికలకు ఒకరోజు ముందు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. ఈ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా మృతుడు ఎరుకలి మహాదేవప్ప సతీమణి ఎరుకలి సత్యమ్మ పోటీ చేయగా అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా మారెప్ప, బీఆర్ఎస్ అభ్యర్థిగా మొగులప్ప పోటీపడ్డారు. ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 12 స్థానాల్లో గెలిచిమున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ నలుగురు కోఆప్షన్ సభ్యులను గెలుచుకున్నప్పటికీ ఈఉప ఎన్నికల్లో తన ఆధిపత్యాన్ని కొన సాగించాలని విశ్వ ప్రయత్నాలు చేసింది. అదే సమయంలో బిజెపి సైతం ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ ఉప ఎన్నికల్లో చనిపోయిన ఎరుకలి మహాదేవప్ప భార్యను ఎరుకలి సత్యమ్మ గెలుపు ద్వారానే అతడి ఆత్మకు శాంతి చేకూర్చాలని పనిచేసి గెలుపు సాధించి సత్తా చాటింది. బిజెపి కాంగ్రెస్ శ్రేణులు హోరాహోరీగా ప్రచారం చేశారు. ఎట్టకేలకు ఓటర్లు బిజెపి అభ్యర్థిని ఆశీర్వదించారు. సోమవారం జరిగిన కౌంటింగ్ సందర్భంగా గెలుపు ఓటములపై కాంగ్రెస్ బిజెపి శ్రేణుల్లో ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో మొత్తం 1453 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ సందర్భంగా 1294 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఎరుకలి సత్యమ్మకు 628 ఓట్లు రాగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మారెప్పకు 591 ఓట్లు సాధించడంతో బిజెపి అభ్యర్థి ఎరుకలి సత్యమ్మ 37ఓట్ల ఆదిత్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అదే సమయంలో బిఆర్ఎస్అభ్యర్థి మొగులప్ప 46 ఓట్లు సాధించారు. నోటాకు 4 ఓట్లు, 25 ఓట్లు చెల్లనివిగా అధికారులు గుర్తించారు. బిజెపి అభ్యర్థి ఎరుకలి సత్యమ్మ 37 ఓట్ల ఆదిత్యంతో ఘనవిజయం సాధించడంతో బిజెపి శ్రేణులు సంబరాల్లో మునిగితేలారు. కాగా ఉప ఎన్నికతో మక్తల్ మునిసిపాలిటీలో బిజెపి సంఖ్య 3 నుండి 4కు చేరుకుంది.

## ప్రతి విద్యార్థి ఒక క్రీడాంశాన్ని ఎంచుకోవాలి

**ధన్వాడ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** ధన్వాడ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక క్రీడాంశాన్ని ఎంచుకోవాలని ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్ సూచించారు. సోమవారం కొండాపూర్ గిరిజన గురుకులంలో సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును ఆయన గురుకుల ప్రిన్సిపల్ ఎం. రాజారాం తో కలిసి ప్రారంభించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ క్యాంప్ ఈ నెల 29 వరకు కొనసాగనుంది. ఇందులో నెట్‌బాల్, కరాటే అంశాల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కొండాపూర్, పెద్దమందడి, మన్ననూరు గిరిజన గురుకులాల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. క్రీడల్లో రాణించిన వారుజీవితంలో ఇతర రంగాల్లోనూ చురుకుదనం కనబరుస్తారని, సమస్యలను సులభంగాపరిష్కరించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. గురుకుల ప్రిన్సిపల్ ఎం.రాజారాం మాట్లాడుతూ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి ఆదేశాల మేరకు కరాటే శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ ఇంటర్ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందకరమని చెప్పారు. సీనియర్ లెక్చరర్ జి.లక్ష్మయ్య విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరాటే శిక్షకుడు శ్రీనివాస్ విద్యార్థులకు ఆత్మరక్షణలో కరాటే ప్రాముఖ్యతనువివరించిమెలకువలునేర్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్‌ప్రిన్సిపల్ సాంబ్యానాయక్, క్యాంప్ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, పీడీ రవీందర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి నా పూర్తి సహకారం

- ఇచ్చిన మాట ప్రకారం రెండో నెల రూ. లక్ష చెక్కు అందజేసిన విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు



పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘానికి రూ. లక్ష చెక్కు అందజేస్తున్న విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆలోచన మేరకు రూపుదిద్దుకున్న పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం సేవలు మరింత విస్తృతం చేసే దిశగా రెండో అడుగు పడింది. విప్ ఇచ్చిన మాట ప్రకారం రెండో నెల జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూపాయలు లక్ష చెక్కును ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం వేదికగాసోమవారం సాయంత్రం సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. అందరూ కలిసి సంక్షేమ నిధిని మరింత బలోపేతం చేసుకుని ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవాలని సంగం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వాకిట అశోక్, మధుసూదన్‌రెడ్డి, జిల్లెలరఘు, జకీ, భాస్కరాచారి, తిరుపతయ్య, పల్లెమోని యాదయ్య, సతీష్‌కుమార్, రమా కాంత్ రెడ్డి, సతీష్‌రెడ్డి, పేట వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన కేజీ మహేందర్ రెడ్డి

**అమరచింత ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం అమరచింత మండలంలోని నందిమల్ల, ఈర్లదిన్నె, చంద్రఘడ్ గ్రామాలలో వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. రైతు సంక్షేమానికే ప్రభుత్వం రుణమాఫీతో పాటు రైతు భరోసా, రైతులకు బోనాస్ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనిని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని రైతులు దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, చిన్న కడుమూరు సర్పంచ్, శివకుమార్, ఈర్లదిన్నెసర్పంచ్ చుక్క వెంకటమ్మ, చింతరెడ్డి పల్లె సర్పంచ్ రామేశ్వరమ్మ, ఏపీఎం, వెంకటప్ప. మహిళా సమైక్య అధ్యక్షురాలు వెంకటమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జింక రవి, ఈర్లదిన్నె శ్రీనివాస్, ఏఈఓ మల్లేష్, మార్కెట్ డైరెక్టర్లు, సీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బసవేశ్వరుడి జయంతి

- బసవేశ్వరుడి ఆలోచనలు అనుసరణీయం
- కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, బాదావత్ సంతోష్, ప్రతీక్ జైన్, విప్ యెన్నం, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చకుళ్ళ డా. రాజేష్‌రెడ్డి



బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, విప్ యెన్నం



బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చుకుళ్ళ డా. రాజేష్ రెడ్డి



నారాయణపేట కలెక్టరేట్‌లో బసవేశ్వరుడి జయంతి వేడుకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** బసవేశ్వర జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణం పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లోని బస వేశ్వరుని విగ్రహానికి సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు బసవేశ్వరుని జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో జీవించిన మహానుభావుడని, సమానత్వం, మానవత్వం, నీతి, ధర్మాలకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా సమాజాన్ని ఒక కుటుంబంలా చూడాలనే ఆయన ఆలోచనలు నేటికీ ఎంతో అనుసరనీయమని ఆమె అన్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గంలో మనం అందరం కలిసి నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు నగరమేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** వందల సంవత్సరాల క్రితమే కుల, వర్ణ, లింగ వివక్షను వ్యతిరేకించి సర్వమానవ సమానత్వాన్ని చాటిచెప్పిన మహాత్ముడు బసవేశ్వరుడని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చుకుళ్ళ డా. రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. మహాత్మ బసవేశ్వరుడి జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల పైన నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. ప్రప్రథమ సంఘసంస్కర్త సమతవాది అని ఎమ్మెల్యే ప్రశంసించారు. అణగారిన వారి వర్గాల పట్ల ఆశావాది నిరంతర మార్గదర్శకుడని, బసవేశ్వరుని మార్గాన్ని ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఆయన తెలిపారు. లింగాయత్ కుల సంఘ నాయకులు నాగర్ కర్నూల్ పట్టణంలో బసవేశ్వరుని విగ్రహం బసవేశ్వర భవన ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు, జిల్లా గౌరవఅధ్యక్షుడు జెమినిసురేష్, జిల్లా ప్రెసిడెంట్ గిరిజ శంకర్, సెక్రెటరీ రాజేష్, మమ్మాయిపల్లి రాజు, మహదేవన్‌పేట రవిశంకర్, రాజేష్ వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

**నారాయణపేట, ఏప్రిల్20 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లో బసవేశ్వర జయంతి వేడుకలను సోమవారం అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి పాల్గొని బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బసవేశ్వరుని బోధనలు సమాజంలో సమానత్వం, న్యాయం, నీతి విలువలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు ఆయన చూపిన మార్గంలోనడుచుకుంటూ సమాజఅభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జిల్లా అధికారులు, వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** బసవేశ్వర జయంతి సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలోని బసవేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దామరగిద్ద గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సత్యనారాయణ, వీరశైవ లింగాయత్ సభ్యులు, గ్రామపెద్దలు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, బసవేశ్వరుని బోధనలను స్మరించుకున్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

**మద్దూర్, ఏప్రిల్20 ప్రభాతవార్త:** మద్దూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వరుడు 893వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి బసవరాధన చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మహేష్ గౌడ్, ఆర్ఐ అమరేందర్ శెట్టి మాట్లాడుతూ బసవేశ్వరుని బోధనలు సమాజానికి ఆదర్శప్రాయమని, సమానత్వం, నీతి, న్యాయం వంటి విలువలను ఆయన ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దూరు మండల సంఘం అధ్యక్షుడు బర్ల జగదీష్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్, కోశాధికారి వార్ల సిద్ధు, కౌన్సిలర్ కల్లపు దినేష్, బర్ల శివకుమార్, బర్ల చంద్రశేఖర్, ప్రింటింగ్ ప్రెస్ సురేందర్, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం మహాత్మ బసవేశ్వర స్వామి 893వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ అధ్యక్షులుసిద్ధంశెట్టి నాగరాజు, జంగం శివయ్య, ఉమామహేశ్వర్, రాజశేఖర్, డా.వీరయ్య, శివకుమార్, రాజేష్, రజినీకాంత్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



బసవేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

# స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి : మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- గురుకుల విద్యార్థులకు సన్మానం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించిన కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఏప్రిల్20, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన మహాత్మ జ్యోతి బా పూలే బిసి సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సత్కరించారు. జిల్లాలోని 7 మహాత్మ జ్యోతి బా పూలే బిసి సంక్షేమ గురుకుల కళాశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం కలెక్టర్‌ను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత చాలా మంది ఆడపిల్లలు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని పేర్కొన్నారు. అలాకాకుండా ప్రతి విద్యార్థి డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత చదువులు చదవాలని సూచించారు. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే తప్పకుండా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె ప్రోత్సహించారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సిఓ వి. శ్రీనివాస్, డిసిఓ సుగుణశ్రీ పాల్గొన్నారు.

## సెన్సెస్ ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** జిల్లాలో జనగణన (సెన్సస్) ప్రక్రియను వేగవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి సెన్సస్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను వినియోగించుకునే అవకాశం కల్పించారని సూచించారు. మొదటి దశలో భాగంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ ద్వారా అధికారులు సెన్సస్ పోర్టల్ లో వారికి వారు లాగిన్ చేసుకొని, వారి సొంత వివరాలను నమోదుచేసి జనాభా గణనలో ఎన్యూమరేట్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాన్ని చూసా..

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



గృహప్రవేశానికి హాజరై నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్న చింతకుంట, ఏప్రిల్20 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాన్ని చూశానని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని లాల్ కోట, బండర్‌పల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లాల్ కోట గ్రామంలో సుల్తానా బేగం జహంగీర్, పింజారి బీరమ్మ ఆంజనేయులు, వడ్ల బుచ్చమ్మ నరసింహులు, లావణ్య నరేందర్, కురువ పూజారి మల్లమ్మ శీను, బండర్ పల్లిలో కోట లలితమ్మ మొగిలన్న లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేశారు. వీరికి ఎమ్మెల్యే నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తుందన్నారు. సొంతింటి కల నెరవేర్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం ఏ ఒక్క గ్రామంలో ఒక్క ప్రభుత్వ ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఈ ప్రజా ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. పరిధిపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శివ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. లాల్‌కోట గ్రామంలో ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేయించినందుకు గాను పంచాయతీ కార్యదర్శి రాజును ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మి నరసింహులు, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఎస్.వెంకటేష్, వెంకటేష్ ముదిరాజ్, సర్పంచులుగోపాల్, శివకుమార్, బత్తుల లలితమ్మ, లాల్‌కోట ఉపసర్పంచ్ రవికుమార్, గ్రామ అధ్యక్షులు ఎన్.వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 50వేల మెజార్టీతో మళ్లీ రెండోసారి నేనే ఎమ్మెల్యే

### ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, ఏప్రిల్20 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని 134 గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు కడుతున్నారు. దాదాపు 2,100 ఇండ్లు పూర్తి చేసాం బ్రహ్మాండంగా గృహప్రవేశాలు చేస్తున్నాం. లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం. ఈ సందర్భంగా ఎన్నికలు ఎప్పుడు పెట్టిన 50,000 వేల మెజార్టీతో మళ్ళీ రెండోసారి నేనే ఎమ్మెల్యేగా ఉంటానని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం గురకొండ, గోపన్ పల్లి, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం దేవరకద్ర నియోజకవర్గంలో ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కూడా ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు. పేదల సొంతింటి కలనుసాకారం చేయడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా గోపన్ పల్లి, గురకొండ, గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే ఉన్నత ఆశయాలతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం కావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయాలకతీతంగా నిజమైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక గ్రామ ప్రజలు జిఎంఆర్ చేసిన సేవలను అభినందించారు. సొంత ఇల్లు లభించడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, గూరకొండ సర్పంచ్, గోపన్‌పల్లి సర్పంచ్, స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు , తాసిల్దార్ దీపిక, దేవరకద్ర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యాటకులు పెరిగేలా ప్రణాళికలు

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రణాళిక రూపొందించుకొని, విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతూ, పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం సృష్టించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేసేందుకు అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. దేశ వ్యాప్తంగా టూరిజం అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉండాలనేది తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోకళా ప్రదర్శనలు నిర్వహించేందుకు హంపీ థియేటర్లు నిర్మించాలని, తద్వారా స్థానిక కళాకారులకు జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయడం..సరైన నిర్వహణకు చర్యలు చేపట్టాలని, పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించడం వంటి చర్యలు తీసుకోవడంతో పాటు పర్యాటక రంగం విస్తరణకు కృషి చేయాలన్నారు.
ప్రత్యేక పర్యాటక ప్రాంతాలు (ఎస్టిఎఎస్) ఆధ్యాత్మికం: యాదగిరి గుట్ట, భద్రాచలం, బాసర, వేములవాడ, అలంపూర్, సోమశిల, రామప్ప, కాళేశ్వరం, మెదక్ వారసత్వం : వరంగల్, నల్గొండ పాలకుర్తి, కరీంనగర్, చార్మినార్ క్లస్టర్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ క్లస్టర్ ఎకోవెల్నెస్ : సిద్దిపేట, నల్లమల సర్క్యూట్, శ్రీరామ్ సాగర్, జన్నారం, గిరిజన (ట్రైబల్) సర్క్యూట్, నాగార్జున సాగర్, వికారాబాద్, మహబూబ్ నగర్ హస్తకళలు : పోచంపల్లి, నారాయణపేట, గద్వాల కొత్తకోజల సర్క్యూట్లు : కొరటికల్, కుంటాల, పొచ్చెర, గాయత్రిబౌద్ధ సర్క్యూట్లు కొండాపూర్, ధూళికట్ట, కారుకొండ, నేలకొండపల్లి, బుద్ధవనం, ఫణిగిరి, గాజులబండ. ఈ సమీక్షలో టీజీటీడీసీ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్, ఎండీ గౌతమి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకాంక్ష మేరకే పనిచేస్తాం

మొదటి పేజీ తరువాయి భాగం..

రేవంత్‌రెడ్డి సారథ్యంలో, ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ భీమా కల్పించే కార్యక్రమాన్ని కూడాప్రభుత్వం ప్రారంభించనున్నదని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే లక్షలాది మందికి ఇళ్లు మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని, సుమారు3,64,000 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనవని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం మరో 4,50,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నదని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా పథకాలను అమలు చేస్తోందని, అందువల్లప్రజలందరూ ఈ ప్రభుత్వాన్ని ఆదరించి భవిష్యత్తులో కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ ఇంచార్జి సిజే బెనహర్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, ప్రధాన కార్యదర్శిసంజీవరెడ్డి, పట్టణకాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహాక అధ్యక్షులు అజ్మత్ అలి, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజావాణి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి భాగం..

హెచ్చరించారు. ప్రజావాణిలో మున్సిపల్, జిల్లా సంక్షేమం, భూసర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, బ్యాంకింగ్, పోలీస్, విద్య, గనులు, కాలుష్య నియంత్రణ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 126 వినతులను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్‌రెడ్డి, జెడ్‌పి సిఈఓ, ఇన్‌చార్జ డిపిఓ వెంకట్ రెడ్డి, డిఆర్‌డిఓ నరసింహులు పాల్గొన్నారు.

## చలో జగిత్యాల ప్రజల ఆశీర్వాద సభకు బయలు దేరిన జడ్చర్ల నాయకులు

**జడ్చర్ల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** తన జీవితాన్ని తెలంగాణ కోసం శ్రమ పడ్డ మహానేత కేసీఆర్ జైత్రయాత్ర సందర్భంగా జగిత్యాలలో జరిగిన బహిరంగ సభకు జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ నాయకులు బయలుదేరారు. జగిత్యాల బయలుదేరిన వారిలోమాజీ జెడ్పి వైస్ చైర్మన్ డా.కోడ్గల్ యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, మాజీ ఎంపిపి శంకర్ నాయక్, మాజీ వైస్ఎంపీపీ రాములు, మాజీ గంగాపూర్ సర్పంచ్ అనంతరెడ్డి, ముడా డైరక్టర్ ఇంతియాజ్ ఖాన్, నాగసాల కొండల్, కరాటే శ్రీను, నయుమ్ ఉన్నారు.